తప్పులు - తిప్పలు

తెలంగాణ మీడియా అకాడమి

తప్పులు - తిప్పలు

తెలంగాణ మీడియా అకాడమి

హైదరాబాద్

మొదటి ముద్రణ : జులై, 2018

రెండవ ముద్రణ : జనవరి, 2023

మూడవ ముద్రణ : సెప్టెంబర్, 2024

ప్రతులు : 3000

ప్రచురణ : తెలంగాణ మీడియా అకాడమి

ప్రతులకు : **తెలంగాణ మీడియా అకాడమి**
ఇ.నెం. 5-9-166, చాపెల్ రోడ్, నాంపల్లి
హైదరాబాద్-500001.
Email ID: mediaacademyoftelanganastate@gmail.com

ముద్రణ:
నవచేతన ప్రింటింగ్ ప్రెస్
12-1-493/VA, గిరిప్రసాద్ భవన్
బండ్లగూడ(నాగోల్), జిఎస్ఐ పోస్ట్
హైదరాబాద్-500 068, తెలంగాణ.
ఫోన్: 040-29884450/53.

ఒక్క మాట

తెలంగాణ మీడియా అకాడమి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు వృత్తిపరమైన నైపుణ్యాన్ని గరపడం ధ్యేయంగా ఆవిర్భవించింది. అంతకుముందు పూర్వ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో స్థాపించిన అకాడమీ ఉద్దేశ్యం లక్ష్యాల ఆధారంగా స్థాపితమైన ఈ సంస్థ దేశంలోనే వార్తా సేకరణ విస్తరణలో ముందున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి, అయినందున ఈ అకాడమీ అవసరమైంది.

రాష్ట్రం మొదలు జిల్లా, మండల కేంద్రాలతో పాటు మున్సిపల్ కార్పోరేషన్, మున్సిపాలిటీలు, పర్యాటక కేంద్రాలు నేడు వార్తల సేకరణ కేంద్రాలుగా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొని ఉన్నాయి. అందువల్ల వందల సంఖ్యలో ఔత్సాహిక జర్నలిస్టులు మీడియా అవసరాల దృష్ట్యా వార్తా సేకరణలో నిమగ్నమైనారు. వీరికి వార్తా, వ్యాసం రాయాలన్నా ఉత్సాహం ఉన్నా నేర్పు, నైపుణ్యం ఉన్నా వృత్తిపరంగా చేయాల్సిన, చేయకూడని (DOs & DONTs) అంశాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది. భారత ప్రెస్ కౌన్సిల్ (PCI) రూపొందించిన వృత్తిపరమైన మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలి. ఆ లోటును మీడియా అకాడమీ పూడ్చాలి. అందుకుగాను స్వల్ప కాల శిక్షణ, సెమినార్లు, వర్క్షాప్స్ వివిధ అంశాలపై నిర్వహించడానికి అకాడమీ పూనుకుంటుంది. అందులో భాగంగానే కోర్సు మెటీరియల్,

చిరు పుస్తకాలు ప్రచురించి ఆర్కైవ్స్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరిస్తుంది. అకాడమీ నూతన భవనం పూర్తయితే, వరుస కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు. అందుకు నూతన ముఖ్యమంత్రి, శ్రీ ఏ.రేవంత్‌రెడ్డి, సమాచారశాఖ మంత్రి, శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని పలు పర్యాయాలు ప్రకటించిన విషయం మీ అందరికీ తెలుసు.

తెలంగాణ మీడియా అకాడమీని వృత్తి నైపుణ్యం పెంపుదల నద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరినీ కోరుతున్నాను.

అభినందనలతో...

కె. శ్రీనివాస్ రెడ్డి

తేదీ: 19.07.2024
హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం
ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమం
స్వాగతం.. సుస్వాగతం

స్వాగతం..

ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమం

ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమం
స్వాగతం..



తప్పులు - తిప్పలు

- చిల్ల మల్లేశం

పత్రికల్లో కొన్ని తప్పులుంటాయి. తెలిసి చేసేవి కాదు. తెలియక చేసేవి. చాలా మంది విలేకరులకు అవి తప్పులు అన్న సంగతి విడమరచి చెబితే తప్ప తెలియదు. 'అన్నారు/తెలిపారు/విమర్శించారు/ఆరోపించారు'లో ఏది ఎప్పుడు వాడాలో అర్థంకాదు.

డైరెక్ట్/ఇన్‌డైరెక్ట్ స్పీచ్ అంటే ఏమిటో? ఎలా రాయాలో? అంతుచిక్కదు. వాక్యనిర్మాణ, అన్వయ దోషాల సంగతి సరేసరి! చాలా మంది విలేకరులు, ఉపసంపాదకులకు భాషా పరిజ్ఞానం తక్కువగా ఉండడం, ఒకటికి రెండు సార్లు సరిచూసుకునే సమయం లేకపోవడం, ఇలా కారణమేదైతేనేం పత్రికల నిండా అక్షర దోషాలతో పాటు ఈ తరహా తప్పులు పాఠకులకు పంటి కింద రాళ్లలా తగులుతుంటాయి. మరి ఇలాంటి దోషాలను ఎలా గుర్తించాలి? ఎలా దిద్దుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.

● వాక్యనిర్మాణ/అన్వయ దోషాలతో జాగ్రత్త..

'పెద్దకల్వలలోని ఎస్సారెస్పీ కార్యాలయంలో ఎస్ఈకి సాగునీరందించాలని కోరుతూ రైతులు వినతిపత్రం సమర్పించారు.' వాస్తవానికి వార్త రాసిన విలేకరికి ఈ వాక్యంలో ఎలాంటి తప్పు లేనట్లే అనిపిస్తుంది. అయితే ఎస్ఈకి సాగునీరందించడం ఏమిటని పాఠకులు నవ్విపోతారు! ఈ గందరగోళమంతా వాక్య నిర్మాణ దోషాల వల్ల వచ్చిందే! ఈ వాక్యాన్ని ఇలా రాయవచ్చు.. సాగునీరందించాలని కోరుతూ రైతులు పెద్దకల్వలలోని ఎస్సారెస్పీ కార్యాలయంలో ఎస్ఈకి వినతిపత్రం సమర్పించారు.

... అలాగే 'మాజీ కేంద్ర మంత్రి', 'మాజీ రాష్ట్ర మంత్రి' అని రాస్తున్నారు. నిజానికి కేంద్రం, రాష్ట్రం మాజీలు కావు. మాజీలయ్యేది మంత్రులు మాత్రమే.

అందుకే 'కేంద్ర మాజీ మంత్రి', 'రాష్ట్ర మాజీ మంత్రి' అనండి. 'రాష్ట్ర సీపీఎం కమిటీ', 'జిల్లా సీపీఐ కమిటీ', 'జిల్లా టీఆర్ఎస్ శాఖ' బదులు 'సీపీఎం రాష్ట్ర కమిటీ', 'సీపీఐ జిల్లా కమిటీ', 'టీఆర్ఎస్ జిల్లా శాఖ', టీడీపీ జిల్లా అధ్యక్షుడు... ఇలా రాయండి.

ఇలాంటి వాక్యనిర్మాణ, అన్వయ దోషాలను గుర్తించేందుకు పెద్ద పాండిత్యం అవసరం లేదు. సాధారణ పరిజ్ఞానం చాలు. రాసిన వార్తను మరోసారి చదవకపోవడమే అసలు సమస్య. ఈ విషయంలో విలేకరులు బద్దకం వీడాలి. వార్తను ఒకటికి రెండు సార్లు చదివి, పదాల స్థానాన్ని మారిస్తే సరిపోతుంది.

● అన్నారా/తెలిపారా/విమర్శించారా..

ఒక వ్యక్తి సభలోనో సమావేశంలోనో మాట్లాడుతున్నాడు. ఆ మాటల్లో మామూలు విషయాలుంటే చివరన 'అన్నారు' అని రాయవచ్చు. ప్రతి వాక్యం చివర 'అన్నారు' వాడితే తప్పులేదుగానీ ఎబ్బెట్టుగా ఉంటుంది. కనుక అప్పుడప్పుడూ 'పేర్కొన్నారు', 'చెప్పారు' అని రాయండి. ఆ ప్రసంగంలో ఏదైనా కొత్త విషయం ఉంటే 'తెలిపారు', 'వెల్లడించారు' అనీ, సాధికారంగా తెలిపితే '(ప్రకటించారు' అనీ, అప్పటిదాకా ఉన్న సందేహాలను నివృత్తి చేస్తే 'స్పష్టం చేశారు' అనీ, కొన్ని సమస్యలను ఏకబిగిన చెబితే 'ఏకరువుపెట్టారు' అనీ, ఒక విషయంపై తన అభిప్రాయాన్ని వెల్లడిస్తే 'అభిప్రాయపడ్డారు' అనీ, లోతుపాతులను విశ్లేషిస్తే 'విశ్లేషించారు' అనీ, ఎదుటి వ్యక్తిపై విమర్శలు గుప్పిస్తే 'విమర్శించారు' అనీ, నిందలు మోపితే 'ఆరోపించారు' అనీ, వెటకారంగా మాట్లాడితే 'ఎద్దేవా చేశారు' అనీ, మంచిమాట చెబితే 'హితవు పలికారు' అనండి, ఇలాగే సమయానుకూలంగా 'పిలుపునిచ్చారు', 'కోరారు', 'విజ్ఞప్తి చేశారు', 'ఆదేశించారు', 'అంగీకరించారు', 'హెచ్చరించారు', 'హామీ ఇచ్చారు'..లాంటి క్రియాపదాలు వాడండి. ఇంకా కొందరు 'అని అన్నారు' అంటూ రాస్తున్నారు. 'అని' లోనే 'అనడం' ఉంది గనుక 'అని చెప్పారు' అనో, 'అని తెలిపారు' అనో రాయండి.

...ఉదాహరణకు ఈ వార్త చూడండి

రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆరునూరైనా ఈ పథకాలను కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పథకాలు అర్హులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వరి

ధాన్యానికి మద్దతు ధరను మరో 300 రూపాయలు పెంచి, రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉండగా ఏనాడూ వ్యవసాయం గురించి పట్టించుకోని చంద్రబాబు, ఇప్పుడు అన్నదాతలపై లేని ప్రేమ ఒలకబోయడం సిగ్గుచేటని ముఖ్యమంత్రి విమర్శించారు. 'నిరాహార దీక్షలు కాదు.. తలకిందులుగా తపస్సు చేసినా రైతులు నిన్ను క్షమించరు' అని బాబును ఎద్దేవా చేశారు.

• డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్ మధ్య తేడా..

చాలా మంది విలేకరులు డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్ మధ్య తేడా తెలుసుకోలేకపోతున్నారు. ఇది ఏమాత్రం మంచిది కాదు. ఒక వ్యక్తి మాట్లాడిన విషయాన్ని అతని/ఆమె మాటల్లోనే రాస్తే అది డైరెక్ట్ స్పీచ్. ఆ విషయాన్ని మన (విలేకరి) మాటల్లో రాస్తే ఇన్‌డైరెక్ట్ స్పీచ్. వార్తలన్నీ ముఖ్యంగా ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లోనే సాగుతాయి. డైరెక్ట్ స్పీచ్‌లో రాయాలనుకున్నప్పుడు ఆ వాక్యాలను తప్పక కొటేషన్స్ ('...') మధ్య ఉంచాలి.

...ఉదాహరణకు ఈ వార్త చూడండి

నేను టీడీపీని వీడే ప్రసక్తి లేదనీ, టీఆర్ఎస్‌లో చేరే ఆలోచన అంతకంటే లేదని ఆ పార్టీ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ స్పష్టం చేశారు. చంద్రబాబు నాయకత్వంలోనే తెలంగాణ పునర్నిర్మాణం కోసం పోరాడుతానని వెల్లడించారు.

..ఈ వార్త రాసిన విలేకరికి డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌ల మధ్య తేడా అస్సలు తెలియదని చెప్పవచ్చు! 'నేను'తో వాక్యం మొదలైంది గనుక డైరెక్ట్ స్పీచ్‌లో ఉందనుకోవాలో, 'స్పష్టం చేశారు', 'వెల్లడించారు' అనే పదాలతో ముగిసింది గనుక ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లో ఉందనుకోవాలో తెలియని పరిస్థితి. అలాగాక డైరెక్ట్ స్పీచ్‌లో ఇలా రాయవచ్చు..

'నేను టీడీపీని వీడే ప్రసక్తే లేదు.. టీఆర్ఎస్‌లో చేరే ఆలోచన అంతకంటే లేదు.. చంద్రబాబు నాయకత్వంలోనే తెలంగాణ పునర్నిర్మాణం కోసం పోరాడుతా..' అని టీడీపీ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ స్పష్టం చేశారు. కొటేషన్స్ మధ్యలో ఉంచిన వాక్యాలు డైరెక్ట్ స్పీచ్‌లో (ఎర్రబెల్లి మాటల్లో) ఉన్నాయి. అలాగాక మొత్తం అంశాన్ని ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లో ఇలా రాయవచ్చు..

తాను టీడీపీని వీడే ప్రసక్తే లేదని ఆ పార్టీ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్

స్పష్టం చేశారు. తనకు టీఆర్ఎస్‌లో చేరే ఆలోచన అంతకంటే లేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే తెలంగాణ పునర్నిర్మాణం కోసం పోరాడుతానని తేల్చిచెప్పారు.

...డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌ల మధ్య తేడా అర్థమయితే, వాక్యనిర్మాణ దోషాలు సగానికి సగం తగ్గుతాయి. డైరెక్ట్ స్పీచ్‌లో 'నేను' వస్తే, ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లో 'తాను', 'తనకు' వస్తాయి. వాక్యాల ముగింపు పదాల్లోనూ వ్యత్యాసం ఉంటుంది. కానీ చాలా మంది 'నేను' బదులు 'తాను' అని రాస్తున్నారు. 'తాను టీడీపీని వీడే ప్రసక్తి లేదు.' అంటున్నారు. ఇది చాలాతప్పు.

● రైతాంగం మేల్కొన్నారు కాదు..

వాక్యాల్లో కర్త ఆధారంగా క్రియా పదాలు రాయండి.

...ఉదాహరణకు

1. నేతకార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు.
2. ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయించింది.
3. రైతులు ఆందోళనకు దిగారు.
4. బీడీ కార్మిక కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి.
5. పోలీస్ బలగాలు దిగాయి.
6. ఆలస్యంగానైనా రైతాంగం మేల్కొంది.
7. ఎన్నికలకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది.

(మొదటి ఐదింటిలా ఉండే వాక్యాలను సరిగ్గానే రాస్తున్నా, చివరి రెండు తరహా వాక్యాల్లో తరచూ తప్పు చేస్తున్నారు. ముఖ్యంగా సిబ్బంది, బృందం, బంధుగణం, రైతాంగం, అధికార యంత్రాంగం, మంత్రి మండలి, మహిళాలోకం, విద్యార్థిలోకం లాంటి సమూహ పదాలు వచ్చినప్పుడు క్రియా పదాలన్నింటినీ 'ది'తోనే ముగించాలి.)

● జరుగుతుంది కాదు జరుగుతోంది..

విలేకరులకు 'కాల' జ్ఞానం అవసరం. చాలామంది భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు తేడా లేకుండా రాస్తున్నారు. వర్తమానంలో మొదలుపెట్టిన వాక్యాన్ని నిజానికి వర్తమానంలోనే ముగించాలి. కానీ భవిష్యత్‌ను సూచించే పదాలతో ముగిస్తున్నారు. పత్రికల నిండా ఇలాంటి తప్పులే!

– అదనపు వరకట్నం కోసమే వెంకటేశ్, తన భార్యను హత్య చేసినట్లు తెలుస్తుంది.
– ఢిల్లీ స్థాయిలో ప్రత్యేక తెలంగాణను అడ్డుకునే కుట్ర జరుగుతుందని కేసీఆర్ ఆరోపించారు.

ఈ రెండు వాక్యాలు వర్తమాన సంఘటనలు కాగా, అందులోని 'తెలుస్తుంది', 'జరుగుతుంది' పదాలు మాత్రం భవిష్యత్తును సూచిస్తున్నాయి. వీటికి బదులు 'తెలుస్తోంది'/'తెలుస్తున్నది', 'జరుగుతోంది'/'జరుగుతున్నది' అని రాస్తే ఆ వాక్య నిర్మాణం సరిగ్గా ఉంటుంది.

● కలపండిలా..

మాట్లాడుతున్నప్పుడు వివిధ పదాల నడుమ మనకు తెలియకుండానే సంధి జరుగుతుంది. ఇది రాతలో కూడా జరగాలి. అప్పుడే పాఠకులు ఇబ్బంది లేకుండా చదవగలరు.

...వీటిని చూడండి

ఉన్నత అధికారులు – ఉన్నతాధికారులు
ప్రభుత్వ ఉపాధ్యాయులు– ప్రభుత్వోపాధ్యాయులు
శుభ ఉదయం – శుభోదయం
రాష్ట్ర అధ్యక్షుడు – రాష్ట్రాధ్యక్షుడు
ప్రారంభ ఉత్సవం – ప్రారంభోత్సవం
జయంతి ఉత్సవం – జయంత్యుత్సవం
వివరాలు ఇవి – వివరాలివి

● కొన్ని ముఖ్యమైన సంధులను తెలుసుకుందాం..

1. సవర్ణ దీర్ఘ సంధి: అ, ఇ, ఉ, రు లకు అవే అచ్చులు కలిస్తే దీర్ఘం వస్తుంది.

...ఉదాహరణకు

అష్ట + అవధానం = అష్టావధానం (అ+అ=ఆ)
కవి + ఇంద్రుడు = కవీంద్రుడు (ఇ+ఇ=ఈ)
భాను + ఉదయం = భానూదయం (ఉ+ఉ=ఊ)

2. గుణ సంధి: 'అ'కారానికి ఇ, ఉ, రు కలిస్తే ఏ, ఓ, ఆర్ వస్తాయి.

...ఉదాహరణకు

రాష్ట్ర + ఇతర = రాష్ట్రేతర (అ+ఇ=ఏ)

వార + ఉత్సవం = వారోత్సవం (అ+ఉ=ఓ)

మహా + రుషి = మహర్షి (ఆ+రు=ఆర్)

3. వృద్ధి సంధి: (ఐ, ఔ లకు వృద్ధులని పేరు)

అ, ఆ లకు ఏ, ఐ కలిసే ఐ.., ఓ, ఔ కలిస్తే ఔ..,

రు, రూ కలిస్తే ఆర్ వస్తాయి. (అ/ఆ+ఏ,ఐ=ఐ)

అ/ఆ+ఓ,ఔ=ఔ, అ/ఆ+రు,రూ=ఆర్

...ఉదాహరణకు

భువన + ఏక = భువనైక

వసుధ + ఏక = వసుధైక

సమ + ఐక్య = సమైక్య

దివ్య + ఔషధం = దివ్యౌషధం

4. అనునాసిక సంధి: (ముక్కుతో పలికే అక్షరాలు = అనునాసికాలు)

క, చ, ట, త, ప లకు న, మ కలిస్తే అనునాసికాలు వస్తాయి.

(క,చ,ట,త,ప + న/మ = అనునాసికాలు)

...ఉదాహరణకు

జగత్ + నాథుడు = జగన్నాథుడు

జగత్ + మోహిని = జగన్మోహిని

5. త్రిక సంధి: (ఆ, ఈ, ఏ లను త్రికములంటారు)

అ + కడ = అక్కడ

ఇలాగే ఎక్కడ, అచ్చోట.. మొదలైనవి.

6. యణాదేశ సంధి: (య, వ, ర లకు యణ్ణులని పేరు)

ఇ, ఉ, రు లకు అసవర్ణాచ్చులు (వేరే అచ్చులు) కలిస్తే

య, వ, ర వస్తాయి.

...ఉదాహరణకు

జయంతి + ఉత్సవం = జయంత్యుత్సవం

అతి + ఆశ = అత్యాశ

అణు + అస్త్రం = అణ్వస్త్రం

7. గ, స, డ, ద, వాదేశ సంధి: క, చ, ట, త, ప లకు బదులు గ, స, డ, ద, వ వస్తాయి. (ద్వంద్వ సమాసంలో)

(క-గ, చ-స, ట-డ, త-ద, ప-వ వస్తాయి)

...ఉదాహరణకు

తల్లి + తండ్రి = తల్లిదండ్రులు, అలాగే అన్నదమ్ములు

● కోర్స్‌లు కాదు కోర్సులు..

'ర్'తో ముగిసే పదాల బహువచనం ఇలా ఉండాలి..

నామినేషన్‌లు	–	నామినేషన్లు
ప్రమోషన్‌లు	–	ప్రయోషన్లు
కోర్స్‌లు	–	కోర్సులు
నర్స్‌లు	–	నర్సులు
డ్రైవర్‌లు	–	డ్రైవర్లు
సర్పంచ్‌లు	–	సర్పంచులు
అరెస్ట్‌లు	–	అరెస్టులు
సబ్జెక్ట్‌లు	–	సబ్జెక్టులు
ప్రాజెక్టులు	–	ప్రాజెక్టులు
క్రీడలలో	–	క్రీడల్లో
కార్యాలయాలలో	–	కార్యాలయాల్లో
విదేశాలలో	–	విదేశాల్లో

● 'రం'కు చేయకండి..

కర్త 'ం'తో ముగిసినప్పుడు దానికి 'ను', 'కు' కలిపితే ఎబ్బెట్టుగా ఉంటుంది. మనం ఎలా మాట్లాడుతామో అలా రాయడం ఉత్తమం.

తప్పు: తాగునీటి పథకంను ప్రారంభించారు.

ఒప్పు: తాగునీటి పథకాన్ని ప్రారంభించారు.

తప్పు: రాష్ట్రంను విభజించాలి.

ఒప్పు: రాష్ట్రాన్ని విభజించాలి.

తప్పు: లోకేశ్వరంకు ఎమ్మెల్యే రాక.

ఒప్పు: లోకేశ్వరానికి ఎమ్మెల్యే రాక.

● 'ర' ఒత్తుతో మొదలుపెట్టొద్దు..

ప్రాచీన పదాలను ముఖ్యంగా 'ర' ఒత్తుతో మొదలయ్యే పదాల ప్రస్తుత రూపాన్ని వాడండి.

క్రింద	–	కింద
క్రుంగు	–	కుంగు
క్రొత్త	–	కొత్త
గ్రుడ్డు	–	గుడ్డు
పారద్రోలు	–	పారదోలు
ప్రాకులాట	–	పాకులాట
బ్రతుకు	–	బతుకు
మారుమ్రోగు	–	మార్మోగు

● 'కి', 'కు'లతో జాగ్రత్త..

తప్పు: ఐదేళ్ల లోపు పిల్లలకి టీకాలు వేశారు.

ఒప్పు: ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలు వేశారు.

తప్పు: నిందితుడికు రిమాండ్ విధించారు.

ఒప్పు: నిందితుడికి రిమాండ్ విధించారు.

.... ఇలా 'తల్లి' వచ్చినప్పుడు 'తల్లికి' అని, 'చెల్లె' వచ్చినప్పుడు 'చెల్లెకు' అని రాయాలి. కర్త 'అ'కారం, 'ఉ'కారం, 'ఎ'కారం, 'ఒ'కారాలతో ముగిస్తే 'కు', 'ఇ'కారంతో ముగిస్తే 'కి' వాడాలి.

● 'వ' వద్దు..

ఒకటవ	–	ఒకటో
రెండవ	–	రెండో

మూడవ – మూడో
నాల్గవ – నాలుగో
అయిదవ – అయిదో

● 'ఒకరు' కాదు.. 'ఒకరి'

రాతలో ఒకరు మృతి చెందారు అని రాస్తే తప్పు లేదు గానీ శీర్షికలు, ఉపశీర్షికల్లో కచ్చితంగా 'ఒకరి మృతి' అని రాయాలి. అలాగే..

తప్పు		ఒప్పు
ఇద్దరు మృతి	–	ఇద్దరి మృతి
ఏడుగురు మృతి	–	ఏడుగురి మృతి
రైతులు విలవిల	–	రైతుల విలవిల
ఉద్యోగులు ఆందోళన	–	ఉద్యోగుల ఆందోళన

● శక్తివంతుడు కాదు.. శక్తిమంతుడు

'వంతం – మంతం' అనేవి విశేషణ పదాలు. వీటిని నామవాచకాలుగా మార్చేటప్పుడు చివరి అక్షరంలో 'అ'కారం వస్తే, 'వంతుడు', 'ఇ'కారం వస్తే 'మంతుడు' వస్తుంది.

ధన + వంతుడు = ధనవంతుడు
బల + వంతుడు = బలవంతుడు
ఆస్తి + మంతుడు = ఆస్తిమంతుడు
నీతి + మంతుడు = నీతిమంతుడు
బుద్ధి + మంతుడు = బుద్ధిమంతుడు
శక్తి + మంతుడు = శక్తిమంతుడు

● సమయము కాదు.. సమయం

పదం చివర 'ము' వస్తే దానికి బదులు 'ం' వాడండి. ('మేము'లాంటి కొన్ని పదాలకు మినహాయింపు)

...ఉదాహరణకు

సమయము	– సమయం
కాలము	– కాలం
పాఠ్యాంశము	– పాఠ్యాంశం
నిదానము	– నిదానం
ప్రధానము	– ప్రధానం

• 'బడు', 'చే' అసలే వాడొద్దు..

ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడా 'బడు' రాయకండి. 'చే'నూ వాడవద్దు. ఇవి వాడుకలో లేవు.

...ఉదాహరణకు

'కలెక్టర్‌చే వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభించబడింది. 'ఈ వాక్యంలో 'చే', 'బడు' వున్నాయి. దీంతో చదివేందుకు ఇబ్బందిగా తయారైంది. 'కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు' అని రాస్తే సరి. 'యొక్క', 'మరియు', 'పట్ల', 'కై' లాంటి పదాలు కూడా ఎక్కడా వాడకండి

• దీర్ఘమివ్వాల్సిందే..

'చేసిన'/'చేశా' అంటే 'చేశాను' అని అర్థం. 'చేసినప్పటికీ' బదులు 'చేసినా' అని వాడుతాం. ఇలాంటి క్రియా పదాల విషయంలో ఈ స్పష్టత సరిపోతుంది. ముఖ్యంగా ఫలితం ఆశాజనకంగా లేనప్పుడు క్రియా పదాలకు దీర్ఘాలు తప్పనిసరి. ఖర్చు చేసినా, కష్టపడ్డా, బోధించినా, తిన్నా.. ఇలా ఏ పదంలోని చివరి అక్షరానికి దీర్ఘమివ్వాలో మీకే తెలుస్తుంది.

...ఉదాహరణకు

తప్పు		**ఒప్పు**
కష్టపడ్డ దక్కని ఫలితం	–	కష్టపడ్డా దక్కని ఫలితం
లక్షలు వెచ్చించిన మారని తీరు	–	లక్షలు వెచ్చించినా మారని తీరు
ఎంత గాలించిన దొరకలేదు	–	ఎంత గాలించినా దొరకలేదు
తలకిందుల తపస్సు చేసిన	–	తలకిందుల తపస్సు చేసినా
ముమ్మర ప్రచారం చేసిన	–	ముమ్మర ప్రచారం చేసినా

... అలాగే కొన్ని పదాల చివర తప్పనిసరి దీర్ఘాలు రాయాల్సి ఉంటుంది. అలాంటి వాటిలో కొన్ని..

అక్షరాల	**-**	**అక్షరాలా**
ప్రతి ఒక్కరు	–	ప్రతి ఒక్కరూ
నెలవారి	–	నెలవారీ
పోటి	–	పోటీ
లూటి	–	లూటీ
లాఠి	–	లాఠీ
దోపిడి	–	దోపిడీ

ఇలా ఎన్నో పదాలున్నాయి. వీటి చివర దీర్ఘాలు రాయడం వెనుక అంతరార్థం ఒకటే. చదవడానికి ఇబ్బంది లేకుండా చూసుకోవడమే! అంటే ఎలా మాట్లాడుతామో అలా రాయడమన్నమాట!

ముఖ్యంగా 'అన్ని', 'ప్రతి' తర్వాత వచ్చే ప్రతి పదం చివరా దీర్ఘం వస్తుంది.

ఉదా: ప్రతి ఒక్కరూ, ప్రతిచోటా, అన్ని విధాలా, అన్ని గ్రామాల్లోనూ.. ఇలా!

● పదవీ విరమణ కాదు..

ఉద్యోగులు విరమణ పొందితే, 'పదవీ విరమణ' అని రాస్తున్నారు. ఇది తప్పు. ఉద్యోగి విరమణ పొందితే 'ఉద్యోగ విరమణ' అనీ, వివిధ పదవుల్లోంచి దిగిపోతున్నవారికి 'పదవీ విరమణ' అని రాయండి. ఉదా: 'ఉపాధ్యాయుని ఉద్యోగ విరమణ కార్యక్రమానికి..', 'గ్రంథాలయ చైర్మన్ పదవీ విరమణ సందర్భంగా..' ఇలా పేర్కొనండి.

● అంకెల విషయంలో జాగ్రత్త..

వివిధ రంగాలకు సంబంధించి రాసే కథనాల్లో గణాంకాలు అవసరమేగానీ మరీ ఎక్కువగా ఉంటే, చదివేందుకు పాఠకులు ఇబ్బంది పడుతారు. అందువల్ల గణాంకాల కంటే విశ్లేషణకే అధిక ప్రాధాన్యం ఇవ్వండి. అంకెలు, సంఖ్యల్లో తప్పులు రాకుండా ఒకటికి రెండుసార్లు సరిచూసుకోండి. అవసరమైన గణాంకాలను వార్తలో కంటే ప్రత్యేక పట్టికల రూపంలో పొందుపరచడం ఉత్తమం.

● 3గురు అని రాయకండి..

వ్యక్తులకు సంబంధించి 3గురు, 4గురు, 5గురు.. అంటూ రాయకండి. ఒకరు, ఇద్దరు, ముగ్గురు, నలుగురు, ఐదుగురు, ఆరుగురు, ఏడుగురు అని రాయండి. ఆ తర్వాత ఎనిమిది మంది, తొమ్మిది మంది.. అనండి.

● రూ. 5.23 కోట్లు అనకండి..

నగదు గురించి రాసేటప్పుడు సామాన్య పాఠకులను కూడా దృష్టిలో పెట్టుకోండి. ₹50 కోట్లు, ₹20 లక్షలు, ₹10 వేలు.. ఇలా రాస్తే ఫర్వాలేదుగానీ కోట్ల తర్వాత వచ్చే లక్షల గురించీ, లక్షల తర్వాత వచ్చే వేల గురించీ, వేల తర్వాత వచ్చే వందల గురించీ ఇలాగే చెప్పాలనుకోవడం సరికాదు. ఉదా: '₹5.23 కోట్లు' అని కాకుండా, '5 కోట్ల 20 లక్షల 3 వేల రూపాయలు' అని రాయండి. (శీర్షికలకు మినహాయింపు) అలాగే '₹2 లక్షల నగదు' అనకండి. '₹2 లక్షలు' అంటే చాలు.

● మిలియన్, బిలియన్ వద్దు..

మిలియన్, బిలియన్, ట్రిలియన్ లాంటి సంఖ్యలను లక్షలు, కోట్లలోకి మార్చి రాయండి. మిలియన్‌ను '10 లక్షలు' అని, బిలియన్‌ను 'వంద కోట్లు' అని, 'ట్రిలియన్'ను లక్ష కోట్లు' అని రాయండి.

● నిమిషాలు కాదు. గంటలు!

చాలా మంది విలేకరులు, 'గంటలు' అని రాయాల్సిన చోట 'నిమిషాలు' అని రాస్తున్నారు. డెస్క్‌లో సబ్‌ఎడిటర్లు కూడా అలాగే వదిలేస్తున్నారు. ఉదా: 'నేటి ఉదయం 11:30 నిమిషాలకు ముఖ్యమంత్రి జిల్లా కేంద్రానికి చేరుకుంటారు' అని రాస్తున్నారు. ఇది తప్పు. '11:30 గంటలకు' అని రాయాలి. నిజానికి ఇది '11 గంటల 30 నిమిషాల'కు సంక్షిప్త రూపం. అంటే 'పదకొండున్నర' అని అర్థం. గంటలు రాశాక మధ్యలో చుక్క (.) పెట్టామంటే తర్వాతి అంకెలు కూడా గంటల్లోకి మారినట్టే లెక్క! రూపాయలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఉదా: పెట్రోల్ ధర రూపాయిన్నర పెరిగితే, 'పెట్రోల్ ధర లీటరుకు 1.50 పైసలు పెంపు' అని రాస్తున్నారు.

ఇది చాలా పెద్ద పొరపాటు. ఇలాగైతే పెట్రోల్ ధర లీటర్‌కు పైసన్నరే పెరిగిందనే అర్థం వస్తుంది. అందుకే దీనిని కూడా 'రూ. 1.50 పెంపు' అని మాత్రమే రాయాలి. పైసల ప్రస్తావన అవసరం లేదు. మీటర్లు, కిలోమీటర్ల లాంటి దూరాలు.. కిలోలు, గ్రాములు, లీటర్లలాంటి తూకాల కొలతలను కూడా పైన చెప్పినట్టే రాయాలి.

● ఆంగ్ల పొడి అక్షరాలతో తిప్పలు..

ఎలా మాట్లాడుతామో అలా రాయడమనేది పత్రికాభాషలో కీలకం. ఆంగ్ల పొడి అక్షరాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఉదాహరణకు 'మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ'ని ఆంగ్ల పొడి అక్షరాల్లో 'ఎం.ఎల్.ఎ.' అని రాయొచ్చు, కానీ చదివేటప్పుడు 'ఎమ్మెల్యే' అని పలుకుతాం. కనుక ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీటీసీ, ఎంపీటీసి, టీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం.. ఇలాగే రాద్దాం.

● విడమరచి చెప్పాల్సిందే!

విలేకరులకు తెలిసిందల్లా పాఠకుడికి తెలియాలని లేదు. అందువల్ల పాఠకుడికి తెలియదనుకొని వార్తలు రాయడమే మంచి విలేకరి లక్షణం. ముఖ్యంగా ఆంగ్ల పొడి అక్షరాల విషయంలో ఎంత చెప్పినా విలేకరులు మారడం లేదు. ఉదా: ఎంపీ అని రాసినప్పుడల్లా పక్కన (మెంబర్ ఆఫ్ పార్లమెంట్) అని రాయనక్కర్లేదు. ఎందుకంటే 'ఎంపీ' అనేది అందరికీ తెలిసిన పదం. కానీ తెలియని సంక్షిప్త పదాలు (Abbreviations) వచ్చినప్పుడు వాటి పూర్తి రూపం చెప్పకపోతే పాఠకుడికి అసహనం కలుగుతుంది. ఉదా: ఒక విలేకరి తాను రాసిన వార్తలో రెండుసార్లు 'ఎల్ఐడీసీఏపీ' అని వాడాడు. డెస్క్ మిత్రుడు ఫోన్ చేసి, దాని పూర్తి రూపమేంటని అడగితే ఆయన 'తెలుసుకొని చెబుతాను సార్..' అంటూ ఫోన్ పెట్టేశాడు. ఎంత దారుణం? నిజానికి ఆ వార్తలో 'ఎల్ఐడీసీఏపీ' అనే పదమే కీలకం. పత్రికా ప్రకటనలో ఎలా ఉందో అలాగే ఈ విలేకరి రాశాడు తప్ప, దాని పూర్తిరూపం తెలుసుకునేందుకు ప్రయత్నించలేదు. ప్రపంచంలో ఏ ఒక్కరికీ అన్ని విషయాలు తెలియవు. విలేకరులూ ఇందుకు మినహాయింపు కాదు. అలాంటప్పుడు తెలియని పదాలను తెలుసుకొని రాస్తే తప్పేంటో అర్థం కాదు. నిజానికి 'ఎల్ఐడీసీఏపీ'ని కలిపి చదివితే 'లిడ్‌కాప్' అవుతుంది. ఇది రాసినా చాలా మంది పాఠకులకు అర్థమవుతుంది. ఇలాంటి పొడి పదాలకు

సంబంధించి తొలుత 'లిడ్‌కాప్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)' అని కచ్చితంగా రాయాలి. ఆ తర్వాత 'లిడ్‌కాప్' అని రాసుకుంటూ పోతే సరిపోతుంది. దీనికి 'ఆంధ్రప్రదేశ్ తోళ్ల పరిశ్రమ' అనే చక్కని తెలుగు అనువాద పదం కూడా ఉంది. ఇది రాస్తే ఇక ఏ బాధా ఉండదు. వివిధ సైన్స్, ఇంజినీరింగ్, వైద్య సెమినార్లలో.., సింగరేణి, ఎన్టీపీసీల్లాంటి భారీ సంస్థల్లో సాంకేతిక సమావేశాలు జరుగుతున్నప్పుడో నిపుణులు తమ ప్రసంగాల్లో మనకు తెలియని ఆంగ్ల పొడిపదాలతో పాటు కొత్త పదజాలం వాడుతారు. కనుక వారి ప్రసంగాన్ని రికార్డు చేసుకొని, మనం రాసుకున్నదానితో సరిచూసుకోవడం గానీ, సమావేశం ముగిశాక వారిని నేరుగా కలిసి అనుమానాలను నివృత్తి చేసుకోవడంగానీ చేయాలి. అలాగాక ఇష్టారాజ్యంగా రాస్తే నవ్వులపాలవుతాం.

● నేరవార్తలతో జాగ్రత్త..

నేరవార్తల్లో విలేకరులు తప్పులు ఎక్కువ చేస్తున్నారు. తాము ఆ సంఘటనను ప్రత్యక్షంగా చూసినట్లు రాస్తున్నారు. హత్య ఎలా జరిగిందో చెబుతున్నారు. అతి వర్ణనలకు పోయి, వెగటు పుట్టిస్తున్నారు. నిందితుడిని 'నేరస్తుడి'ని చేస్తున్నారు. న్యాయమూర్తులుగా మారిపోయి ఎవరిది తప్పో చెప్పేస్తున్నారు. ఏకంగా తీర్పులిచ్చేస్తున్నారు. ఇలాంటి రాతలు చట్టపరంగా తీవ్రమైనవి. అందుకే పోలీసులు, బంధువులు, గ్రామస్తులతో మాట్లాడి, పోలీసుల/బంధువుల కథనం మేరకు.. అంటూ వార్తను మొదలుపెట్టడం ఉత్తమం.

... ఉదాహరణకు ఈ వార్తను చూడండి.

కట్నం కోసం భార్య హతం..

కాళ్ల పారాణి ఆరనే లేదు. మామిడి తోరణం వాడనే లేదు. పెళ్లి పందిరి తీయనే లేదు. పెళ్లై నెల రోజులు కూడా కాలేదు. వరకట్నం కోసం నవ వధువును చంపిన సంఘటన, సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని పర్లపల్లికి చెందిన రాజయ్య, లక్ష్మి దంపతుల కొడుకు రమేశ్ (25)తో నుస్తులాపూర్‌కు చెందిన మల్లయ్య, రాజవ్వ దంపతుల కూతురు సునీత (23)కు నెల క్రితం వివాహం జరిగింది. పెళ్లికి ముందు రెండు లక్షల కట్నం, ఐదు తులాల బంగారం ఒప్పుకున్నారు. ఇందులో బంగారంతో

పాటు లక్ష రూపాయల కట్నం పెళ్లిలో సమర్పించారు. మిగిలిన లక్ష రూపాయల కట్నం తర్వాత ఇస్తామన్నారు. ఈ విషయాన్ని సునీత, తల్లిదండ్రుల దృష్టికి తెచ్చింది. త్వరలోనే ఇస్తామని వారు చెప్పారు. కానీ ఇంతలోనే ఇంత పని చేస్తాడని అనుకోలేదని సునీత తల్లిదండ్రులు విలపించారు. ఈ క్రమంలో మిగిలిన కట్నం వెంటనే తెమ్మని సోమవారం అర్ధరాత్రి రమేశ్, సునీతను ఒత్తిడి చేశాడు. ఇప్పుడే డబ్బులు అడిగితే మావాళ్లు ఎక్కడి నుంచి తెస్తారని సునీత ప్రశ్నించింది. దీంతో మాటామాటా పెరిగి, కోపోద్రిక్తుడైన రమేశ్, బయటకు వెళ్లి గొడ్డలి తెచ్చాడు. కాళ్లా వేళ్లా పడ్డా కనికరించకుండా కసి తీరా నరికాడు. ఆమె పెట్టిన చావు కేకలు, ఎవరినీ కదిలించలేదు. రక్తపుమడుగులో పడి కొట్టుకుంటూ సునీత, పది నిమిషాల్లోపే ప్రాణం విడిచింది. వెంటనే ఆమె భర్త అక్కడి నుంచి పరారయ్యాడు. తన రాక్షస చర్యతో మానవత్వానికే మచ్చతెచ్చిన రమేశ్‌ను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఈ వార్తను జాగ్రత్తగా పరిశీలిస్తే, కొన్ని విషయాలు గమనించవచ్చు..

- 'కాళ్ల పారాణి ఆరనే లేదు. మామిడి తోరణం వాడనే లేదు. పెళ్లి పందిరి తీయనే లేదు. పెళ్లై నెల రోజులు కూడా కాలేదు..' ఇది అతి వర్ణన. పెళ్లైన నెల రోజుల దాకా మామిడి తోరణాలు వాడవా? అందుకే పెళ్లై నెలైనా కాకముందే ఓ భర్త, భార్యను దారుణంగా హతమార్చాడు. అని రాస్తే సరిపోతుంది.
- 'వరకట్నం కోసం నవ వధువును చంపిన సంఘటన, సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది.' ఈ 'చోటు చేసుకుంది', 'జరిగింది' అనే పదాలతో వాక్యాలు ముగించడమే తప్పు. విషయాన్ని సూటిగా చెబితే బాగుంటుంది. తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన రమేష్(25), తన భార్య సునీత (23)ను హత్య చేసినట్లు తెలుస్తోంది అని రాస్తే సరిపోతుంది. ఇక్కడ హత్య చేసింది రమేషో, వేరే వ్యక్తో మనకు తెలియదు. అది తేల్చాల్సింది పోలీసులు. మనం కాదు.
- మండలంలోని పర్లపల్లికి చెందిన రాజయ్య, లక్ష్మి దంపతుల కొడుకు రమేశ్ (25)తో నుస్తులాపూర్‌కు చెందిన మల్లయ్య, రాజవ్వ దంపతుల కూతురు సునీత (23)కు నెల క్రితం వివాహం జరిగింది. పెళ్లికి ముందు రెండు లక్షల కట్నం, ఐదు తులాల బంగారం ఒప్పుకున్నారు. ఇందులో బంగారంతో పాటు లక్ష

రూపాయల కట్నం పెళ్లిలో సమర్పించారు. మిగిలిన లక్ష రూపాయల కట్నం రెండు నెలల తర్వాత ఇస్తామన్నారు. ఈ విషయాన్ని సునీత, తల్లిదండ్రులు దృష్టికి తెచ్చింది. త్వరలోనే ఇస్తామని వారు చెప్పారు. కానీ ఇంతలోనే ఇంత పని చేస్తాడని అనుకోలేదని సునీత తల్లిదండ్రులు విలపించారు.

.... ఈ సమాచారం విలేకరికి ఎలా తెలిసింది? సునీత తల్లిదండ్రులు చెబితేనే కదా! కానీ చెప్పిన వారి మాటల్లో కాకుండా మన మాటల్లో చెప్పడం సరికాదు. దీనిని ఇలా రాస్తే మంచిది.

సునీత తల్లిదండ్రులు మల్లయ్య, రాజవ్వ కథనం ప్రకారం, వారి రెండో కూతురు సునీతను, పర్లపల్లికి చెందిన రాజయ్య, లక్ష్మి దంపతుల కొడుకు రమేశ్‌కిచ్చి నెల క్రితం పెళ్లి చేశారు. పెళ్లికి ముందు రెండు లక్షల కట్నం, ఐదు తులాల బంగారం ఒప్పుకున్నారు. పెళ్లిలో బంగారంతో పాటు లక్ష రూపాయలిచ్చి, మిగిలిన లక్షను రెండు నెలల తర్వాత ఇస్తామన్నారు. ఈ విషయాన్ని సునీత, ఇటీవల తల్లిదండ్రుల దృష్టికి తెచ్చింది. త్వరలోనే ఇస్తామని వారు చెప్పారు. అంతలోనే హత్య జరగడంతో హతాశయులయ్యారు. (ఒకవేళ ప్రత్యక్షంగా చూసినప్పటికీ 'గొడ్డలితో కసితీరా నరికాడు' అంటూ రాయడం సరికాదు.)

గుర్తుంచుకోండి..

- తల్లిదండ్రుల/బంధువుల/పోలీసుల కథనం ప్రకారం అని మొదలు పెడితే ఆ తర్వాత ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లోనే రాయండి.
- తల్లిదండ్రుల/బంధువుల/పోలీసుల మాటల్లో.. అని మొదలుపెడితే మాత్రం డైరెక్ట్ స్పీచ్‌లో (కొటేషన్స్ మధ్య) రాయండి.
- లైంగికదాడి, లైంగికదాడికి యత్నం జరిగినప్పుడు బాధితుల పేర్లు, వారి తల్లిదండ్రుల పేర్లు, వారెవరో తెలుసుకోగలిగే ఇతర ఏ సమాచారం ఇవ్వకండి. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధితుల ఫోటోలు వాడకండి.
- 'అక్రమ సంబంధం'ను 'వివాహేతర సంబంధం' అనీ, 'అత్యాచారం', 'అత్యాచారయత్నం' పదాలకు బదులు 'లైంగిక దాడి', 'లైంగికదాడికి యత్నం' అని రాయడం ఉత్తమం.
- వ్యభిచారం చేస్తూ పోలీసులకు చిక్కిన మహిళల పేర్లను, వారిని పట్టుకున్న చోటును ఎట్టి పరిస్థితుల్లో రాయకండి.

– బాల నేరస్తుల పేర్లు, వారిని గుర్తుపట్టే ఎలాంటి వివరాలూ రాయకండి. 2006 జువెనైల్ యాక్ట్‌లోని సెక్షన్ 23 ప్రకారం.. ఈ నిబంధన ఉల్లంఘిస్తే జైలు శిక్షతోపాటు ₹25 వేల దాకా జరిమానా విధించే ప్రమాదముంది.

– దొంగతనాలు, దోపిడీలు జరిగినప్పుడు ఎత్తుకెళ్లినదానికంటే ఎక్కువ సొమ్ము పోయినట్లు బాధితులు చెప్పే అవకాశముంది. అందుకే '10 లక్షల రూపాయలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు' అని రాయండి.

– అలాగే వైపరీత్యాలు, ప్రమాదాల్లో ఆస్తినష్టం జరిగినప్పుడు వాస్తవాలు తెలుసుకుని రాయండి.

... ఉదాహరణకు ఒక విలేకరి, 'గుడిసెకు నిప్పంటుకొని 8 లక్షల రూపాయల నష్టం' అనే శీర్షికన వార్త రాశాడు. ఇది అలాగే అచ్చయింది. అంత సొత్తున్న కుటుంబం గుడిసెలో ఎందుకుంటుంది? ఒకసారి ఆదిలాబాద్ జిల్లాలో జిన్నింగ్‌మిల్ తగలబడి 5 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు వార్త రాశారు. తీరా చూస్తే ఆ యజమానే, బీమా కోసం తగలబెట్టుకున్నట్లు తేలింది. అందుకే ఇలాంటి ఘటనల విషయంలో జాగ్రత్తగా ఉండండి.

– మూఢనమ్మకాలను ప్రోత్సహించేలా వార్తలు రాయకండి. బాణామతి, చేతబడి అంటూ క్షుద్రపూజల పేరిట ప్రజలను మోసగించేవారినీ, రోగాలను నయం చేస్తామని అశాస్త్రీయ వైద్యం చేసేవారినీ ఎండగట్టండి.

– 'బొప్పాయిలో వినాయకుడు', 'వంకాయలో ఓంకారం' లాంటివీ రాయవద్దు. ఒకవేళ రాయాల్సి వస్తే 'బొప్పాయిలో వినాయక ఆకారం', 'వంకాయలో ఓంకార రూపం' అని మాత్రమే రాయండి.

– ఆత్మహత్యలను మరీ ఎక్కువ చేసి చూపవద్దు. హత్యకు ఉపయోగించిన వస్తువుల గురించి పదేపదే రాయవద్దు. అసలు ప్రస్తావించకపోతేనే మంచిది.

– మత కలహాలు చెలరేగినప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మతాల పేర్లు కాకుండా 'రెండు వర్గాలు' అని మాత్రమే రాయాలి. బాధితులు, మృతులు పేర్లు రాయవద్దు. పేర్ల ద్వారా వారు ఏ మతస్తులో తెలిసే ప్రమాదముంది.

– కోర్టులో నేరం రుజువయ్యేదాకా 'నిందితుడు' అనే రాయండి. ఎట్టి పరిస్థితుల్లోనూ 'నేరస్తుడు' అని రాయకండి.

– కోర్టు గౌరవానికి భంగం కలిగించేలా రాయకండి. న్యాయమూర్తులకు దురుద్దేశాలు

ఆపాదించడం, కోర్టు అధికారాలను కించపరచడం లాంటివి చేయకండి. కోర్టు ధిక్కారానికి పాల్పడితే విలేకరులపై కఠిన చర్యలుంటాయి.

– నేర వార్తల సేకరణలో భాగంగా, ప్రైవేట్ సంస్థలు/ఇళ్లలోకి అనుమతి లేకుండా ప్రవేశించకండి.

– అనవసరంగా వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లకండి. ఒక వ్యక్తి అనుమతి లేకుండా అతని ఫోటోలు తీయకండి. బాధితుడు, తనకున్న ప్రైవసీ హక్కును వినియోగించుకుని మనపై పరువునష్టం దావా వేసే ప్రమాదముంది.

● నేర వార్తల్లో జరిగే ఇతరత్రా తప్పులు..

– ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. (ఇందులో 'ఆత్మహత్య'కు 'మృతి' పునరుక్తి అవుతుంది. 'ఆత్మహత్య చేసుకున్నాడు' అంటే సరిపోతుంది.)

– మృతుడు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా..,, (మృతుడెలా వెళ్తాడు?)

– దైవ దర్శనానికి వెళ్లి శవాలై తిరిగి వచ్చారు. (శవాలై ఎలా తిరిగి వస్తారు?)

– గుర్తు తెలియని దొంగలు (గుర్తు తెలిసిన దొంగలు ఉండరు కదా! 'దొంగలు' అని రాస్తే చాలు)

.. విషయాన్ని సూటిగా రాస్తే ఇలాంటి తప్పులు జరిగే అవకాశం ఉండదు.

– 'స్వర్గీయ', 'విధి ఆడిన వింత నాటకంలో', 'ఏ జన్మలో చేసుకున్న పాపమో', 'ఏ దేవుడి శాపమో' లాంటి మానవాతీత మాటలు వీడండి. ఇలా రాస్తే, దేవుడు, స్వర్గం, నరకం, ఖర్మ సిద్ధాంతాన్ని మనం నమ్ముతూ పాఠకులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నామని అర్థం.

మీడియా అకాడమీ ప్రచురణలు

తప్పులు – తిప్పులు

వార్త – రాత

తప్పులు దిద్దుకోండి





వార్తా కథనాలు

నేర వార్తలు
పదజాలం

టీవీ విలేకరి

టీవీ డెస్క్ విజన్

సుపరిపాలనకు పెద్దదిక్కు
సమాచార హక్కు



ప్రసార సాధనాలు
పరస్పర ఆధారితాలు

విలేకరులు – పోలీసులు